మార్చి - ఏప్రియల్, 2010

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



**“తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుచున్నాను”**



# “మనస్సులోని మాట”

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

యేసుక్రీస్తు నామములో మీకు శుభములు. నూతన సంవత్సరములో రెండు నెలలు పోషించి, సంరక్షించిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. ప్రాంతీయ విద్వేషాలు రగులుకుంటున్న సమయములలో నిజక్రైస్తవుడు కలిగి ఉండవలసిన విధానమును తెలుసుకొనవలసిన వారమై ఉన్నాము. ఒక మనుష్యుడు మరియొక మనుష్యుని ద్వేషించటం దేవుడు పాపంగా ఎంచుచున్నాడు. కనుక ద్వేషించుట అనే మనస్తత్వం మనము కలిగి ఉండకూడదు. అలాగే బలవంతపు మరణములు దేవుని మనసు కలిగిన మనుష్యులను ఎంతగానో బాధిస్తాయి. జీవితములో ఎలాంటి సమస్యకైననూ ఒక పరిష్కారం ఉంటుంది. మరణించడం అనేది పరిష్కారం కాదు. వ్యక్తిగతంగా నాకు జీవితములో ఎక్కువ దుఃఖమును కలిగించే విషయము బలవన్మరణములు. ఎలాంటి సమస్యలలోనైనా మనము ధైర్యముగా జీవించాలంటే సిలువ శ్రమలను భరించిన యేసుక్రీస్తును జ్ఞాపకం చేసుకోవాలి. ఆయన సిలువలో శ్రమపడిన దినమును గుడ్‌ఫ్రైడే అని మనము జరుపుకుంటాము. గుడ్‌ఫ్రైడే దినమున మాత్రమే కాకుండా ప్రతి దినమూ సిలువ ధ్యానము మనకి ఎంతో అవసరము. సిలువలో యేసుక్రీస్తు కార్చిన రక్తము ద్వారా మన పాపములు పరిహరించబడుచున్నవి.

2010-11 విద్యా సంవత్సరములో ఫైనల్ ఎగ్జామ్స్ జరుగబోవుచున్నాయి. స్టూడెంట్స్ అందరూ ఎగ్జామ్స్ బాగా వ్రాయాలని మనము ప్రార్థన చేద్దాము. పిల్లలకి చదువు జ్ఞానం నేర్పించాలి కానీ, కేవలం మార్కులు సంపాదించేదిగా ఉండకూడదు. పరిచర్యలో పాలి భాగస్తులుగా ఉండి, దేవుని పనిలో ప్రయాసపడుచున్న ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక వందనములు. దేవుడు మీకు అనుగ్రహించిన కృపను నిరర్థకము చేసుకొనవద్దు అని మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను.

దేవుడు మిమ్ములను, మీ కుటుంబములను దీవించును గాక !

మీ సహోదరుడు.....



మార్చి - ఏప్రియల్, 2010

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- ఆశీర్వాదం ........ 2
- విత్తనము - ఫలము ........ 6
- అహంకార గులాబి (స్త్రీల ప్రత్యేకం) ........ 7
- విజయమునకు సూత్రములు ........ 10
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 9వ భాగము ........ 12
- జిమ్మి అండ్ ది ఏంజిల్ (బాలల శీర్షిక) ........ 14
- నా జీవితంలో దేవుని మేలులు (సాక్ష్యము) ........ 15
- ఇది తెలుసా? (హైతి) ........ 17
- నిజమైన పరీక్ష ........ 18
- ఆత్మ ఫలము ........ 19
- గిలాదు కొండ ........ 20
- బైబిల్ క్విజ్-9 ........ 21
- 2010 ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23



మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# ఆశీర్వాదము

- బ్రదర్ ఎపఫ్రా



ఆశీర్వాదము అనే మాట ప్రతి మనిషికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది. అందుకే మనుష్యులు ఆశీర్వాదము కొరకు గుళ్ళు, గోపురములు, చర్చిలు అని ఆధ్యాత్మిక కేంద్రముల వెంట తిరుగుతూ ఉంటారు. పుణ్యక్షేత్రముల చుట్టూ తిరగటం ద్వారా ఆశీర్వాదమును సంపాదించు కోగలమా? మరి ముఖ్యముగా మన దేశంలో ఆశీర్వాదం అనే పేరుతో అమాయక ప్రజలను ఎంతోమంది మోసం చేయడం చూస్తూ ఉంటాము. సృష్టించిన సృష్టికర్త తప్ప ఎవరూ ఒక మనిషిని ఆశీర్వదించలేడు. ఒకరోజు సృష్టికర్త అయిన దేవుడు పాదము పట్టునంత భూమి అయిననూ లేనప్పుడు నీ తరువాత నీ సంతానమునకు ఈ దేశమును ఇస్తానని అబ్రాము అనే వ్యక్తికి వాగ్దానము చేసాడు, ఆ తరువాత వాగ్దానము నెరవేర్చాడు. ఎందుకు దేవుడు ఆ వాగ్దానమును నెరవేర్చాడు, అతనిలో ఉన్న ప్రత్యేకత ఏమిటి? అని పరిశీలించినప్పుడు అబ్రాము కొన్ని ప్రత్యేకమైన లక్షణములను కలిగి ఉన్నాడు. అవి దేవునికి ఎంతో ప్రీతికరమైనవి. అబ్రాము నోవహు పెద్ద కుమారుడైన షేము వంశావళిలో నుండి వచ్చిన తెరహు కుమారుడు.

అబ్రాము జీవితములోని కొన్ని ప్రత్యేకలక్షణములను పరిశీలిద్దాము:–

**1. విధేయత చూపించుట :–** అబ్రాము తండ్రి ఇంటిలో మొదటిగా పుట్టినవాడు. నీవు లేచి నీ దేశము నుండియు, నీ బంధువుల యొద్ద నుండియు, నీ తండ్రి ఇంటి నుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము (ఆది 12:1) అని చెప్పినప్పుడు అబ్రాము మారు మాట్లాడక, వెంటనే ఆ ప్రాంతము నుండి బయలుదేరి వెళ్లాడు. దేవుడు చెప్పిన మాటకు అబ్రాము విధేయత చూపించాడు.

**2.ప్రార్థించుట :–** అబ్రాము దేవుని మాట చొప్పున బయలుదేరి వెళ్ళుచూ బేతేలుకు, హాయికి మధ్యలో గుడారము వేసికొనెను. అక్కడికి చేరిన వెంటనే ఆ ప్రదేశము, ప్రజలు ఎలాంటి వారో తెలుసుకుందామని ప్రయత్నించ లేదు కానీ తనకు ప్రత్యక్షమై, వాగ్దానము చేసిన దేవునికి బలిపీఠమును కట్టి, ఏం చేయాలో తెలియని పరిస్థితులలో యెహోవా నామములో ప్రార్థన చేసెను. మన కష్ట సమయములలో దేవుని సన్నిధిలో, యెహోవా నామమున ప్రార్థన చేసేవారిగా ఉండాలి. మనలను మనము ఆయనకు అప్పగించుకొని, ప్రార్థించినప్పుడు అబ్రాముకి సహాయం చేసిన దేవుడు తప్పక మనకి సహాయం చేస్తారు.

**3. సమాధానమును కోరుకొనుట :-**



దేవుని చేత ఆశీర్వదించబడి, ఆస్తి విస్తరించుట వలన అబ్రాము ధనవంతుడయ్యాడు. అప్పుడు అబ్రాము గొర్రెల కాపరులకు, లోతు గొర్రెల కాపరులకు కలహము జరిగినందున అబ్రాము మనము బంధువులము గనుక నాకును నీకును, నా పశువుల కాపరులకు, నీ పశువుల కాపరులకు కలహముండ కూడదు, దయచేసి నన్ను విడిచి వేరుగా ఉండుము అని లోతుతో చెప్పాడు. అబ్రాము సమాధానము కలిగి జీవించాలనే ఆలోచనతో అట్టి జీవితమును కోరుకున్నాడు. అంతేకాదు అబ్రాము తన తమ్ముడి కుమారుడైన లోతుతో నీవు ఎడమ తట్టునకు వెళ్లిన యెడల, నేను కుడితట్టునకును, నీవు కుడి తట్టునకు వెళ్లిన యెడల నేను ఎడమ తట్టుకును వెళ్లుదునని చెప్పెను (ఆది 13:9)

ఇక్కడ అబ్రాము అచంచలమైన విశ్వాసము గలవాడిగా కనబడుచున్నాడు. అంతేకాక గొడవలు పెట్టుకొనక, సమాధానమును కోరుకునే మనస్సుతో జీవిస్తున్నాడు. లోతు వెళ్లిపోయినవెంటనే దేవుడు అబ్రాము యొక్క మంచి మనస్సును చూచి ఏం చేశాడో చూసారా! నాలుగువైపులా చూడు, దీనినంతటిని నీకును, నీ సంతానమునకును ఇస్తానని వాగ్దానం చేసాడు. నాలుగువైపులా అంటున్నాడు మరి లోతు ఎక్కడ? దేవుని మనస్సులో లోతు లేడని దీనిని బట్టి అర్థం అవుతుంది. కాబట్టి సమాధానమును కోరుకొనువాడు తెలివితక్కువ వాడుగా కనిపించినా చివరికి పైచేయి సాధిస్తాడు.

సమాధానకరమైన మనస్సు మంచి ఆరోగ్యమును, సంతోషకరమైన హృదయమునకు కలుగజేస్తుంది కనుక గొడవలు పెట్టుకునే మనస్తత్వం కాక, సమాధానకరమైన మనస్సు కలిగి దేవుని ఆశీర్వాదమును కలిగివుందాము.

**4. శత్రువుని క్షమించుట :-**

తమ్ముడి కుమారుడైన లోతు వచ్చిన అవకాశమును ఉపయోగించుకొని, యెహోవా తోట వలె కనబడుచున్న పచ్చని ప్రదేశమును ఎంచుకొని వెళ్లిపోయాడు. ఆ సొదొమ, గొమొఱ్ఱ ప్రాంతముల మీద శత్రురాజులు దాడి చేసి లోతును, లోతు ఆస్తిని, స్త్రీలను పట్టుకుపోయారనే వార్తను విన్న అబ్రాము వెంటనే తన దగ్గర ఉన్న దాసులను వెంటబెట్టుకొని పోయి, శత్రువులను జయించి లోతును, ఆస్తిని, స్త్రీలను కాపాడెను.

లోతు అబ్రాముతో కూడా వచ్చిన వాడు. అబ్రాము పశువుల కాపరుల గురించి చెప్పినప్పుడు కానీ, వెళ్లమన్నప్పుడు కానీ నాదేముంది, నేను నీ వెంట వచ్చిన వాడను, నువ్వు ఎలా చెబితే అలా వింటాను అని అనకపోగా, ఇదే అవకాశం అన్నట్లుగా వెళ్లిపోయాడు.



శత్రువు వలె ప్రవర్తించిన తన తమ్ముడి కుమారుడిని క్షమించి, సహాయము చేశాడు అబ్రాము.


**5. దశమ భాగం చెల్లించుట :-**

శత్రువులను జయించి, అబ్రాము తిరిగి వచ్చుచున్నప్పుడు షాలేము రాజైన మెల్కీసెదెకు అను యాజకుడు రొట్టె, ద్రాక్షారసముతో అతనిని ఎదుర్కొని హృదయపూర్వకముగా దేవుని వాగ్దానమును బట్టి అతనిని ఆశీర్వదించాడు (ఆది 14:20) అప్పుడు అబ్రాము తనకు కలిగిన వాటన్నిటిలో పదియవ వంతు యజకునికి ఇవ్వటం జరిగింది.

పదియవ వంతు తమది కాదు దేవునిది అనే విషయము చాలా మందికి తెలియదు. దేవునికి చెందవలసిన పదియవ వంతుని దానధర్మములు చేసేవారు ఉన్నారు. అలాగే పదియవ వంతు మేము ఇవ్వనక్కరలేదు అని, సేవకే ఖర్చు పెడుతున్నామని సమర్ధించుకునే సేవకులు ఉన్నారు, కానీ అబ్రాము అలా చేయలేదు. తనకు రొట్టెను, ద్రాక్షారసమును తెచ్చి ఇచ్చిన యాజకునికి పదియవ వంతు ఇవ్వటం జరిగింది. దశమ భాగం విషయంలో కుంటి సాకులు చెప్పకుండా మనం వెళ్లే దేవుని మందిరములలో దేవునికి చెల్లించేవారమై ఉండాలి. సేవకులైతే తమపైన నాయకులకు లేదా తమకంటే ఎక్కువగా దేవుని చేత వాడబడుచున్న దైవసేవకులకు ఇవ్వాలి. దేవునివి దేవునికి ఇవ్వనివాడు దేవుని సొమ్మును దొంగిలించు చున్నాడని వాక్యము చెబుతుంది. వారు దేవునిని ప్రేమిస్తున్నామని చెప్పడంలో అర్థం లేదు.

**6. ఆతిథ్యము ఇచ్చే మనసు :-**

అబ్రాహాము ఎండవేళ గుడార ద్వారము దగ్గర కూర్చుని ఉన్నప్పుడు, ముగ్గురు మనుష్యులు అతని యెదుట నిలువబడిరి. వారిని ఎదుర్కొనుటకు పరుగెత్తి, నేల మట్టుకు వంగి, (ఆది 18:2,3). ఆతిథ్యము ఇచ్చుటలో ఎంతో ఆత్రుత, ఆసక్తి అబ్రాహాములో కనబడుతున్నాయి. ఆ ఆతిథ్యమును స్వీకరించి, ముగ్గురు మనుష్యులు అబ్రాహామును ఆశీర్వదించి వెళ్ళారు.



ఆతిథ్యము ఇచ్చే అవకాశము రావడం గొప్ప ధన్యత. ఆతిథ్యం తీసుకోవటం గొప్ప విషయము కాదు కాని ఇవ్వడం అనేది విలువైనది. ఆతిథ్యం అనేది ఈ దినములలో ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉన్నది. అబ్రాహాము ఇచ్చిన ఆతిథ్యం ప్రతిఫలం ఆశించనిది. ఇట్టి మనస్సు ఆశీర్వాదమును కలిగిస్తుంది.



**7. కుమారుని ఇచ్చుట:-**

అనేక సంవత్సరముల నిరీక్షణ తరువాత పుట్టిన వాగ్దాన పుత్రుడు. "నీకు ఒక్కడైయున్న నీ కుమారుని, అనగా నీవు ప్రేమించు ఇస్సాకుని తీసుకొని, దహన బలిగా అతని నర్పించుమని చెప్పెను .( ఆది 22:2)

దేవుడు మనుష్యులను దహన బలిగా అడగటం చరిత్రలో అంతకు ముందు ఎప్పుడూ జరుగలేదు. అయినప్పటికీ అబ్రాహాము సందేహింపక తన పనివారిలో ఇద్దరిని వెంటబెట్టుకొని ఇస్సాకుతో కలిసి ఆ చోటికి వెళ్లెను. మార్గమధ్యంలో ఆ చిన్నవాడు అమాయకంగా నా తండ్రీ ! కట్టెలును, నిప్పును ఉన్నాయి కాని దహన బలికి గొర్రె పిల్ల ఏది అని అడిగెను. కుమారుడా! దేవుడే చూచు కొనును అని చెప్పి సముదాయించెను.

దేవుడు చెప్పిన చోటికి వచ్చి, బలిపీఠము కట్టి, బలిపీఠము మీద కట్టెలు పేర్చి, తన కుమారుడైన ఇస్సాకును బంధించి కట్టెలపై ఉంచెను. ఇస్సాకును వధించుటకు చేయి చాపి కత్తి పట్టుకొనగా యెహోవా దూత పరలోకము నుండి అబ్రాహామా, అబ్రాహామా ఆ చిన్న వాని మీద చేయి వేయకుము. ఒక్కడే అయ్యున్న నీ కుమారుని ఇచ్చుటకు వెనుతీయలేదు కనుక నీవు దేవునికి భయపడే వాడవని నాకు కనబడుచున్నదని చెప్పెను. నీవు నా మాట వినినందున, భూలోక నివాసులందరు నీ సంతానము వలన ఆశీర్వదించబడుదురని చెప్పెను.

ప్రియచదువరీ! అబ్రహాము యొక్క జీవితంలో పైన పరిశీలించిన 7 లక్షణములు సామాన్యమైన వ్యక్తిని ఆశీర్వాదానికి కేంద్ర బిందువుగా మార్చటం జరిగింది. కాబట్టి మనము ఆశీర్వదించబడటం మాత్రమే కాకుండా మన ద్వారా అనేకులను ఆశీర్వదించే దేవుడు మన ప్రభువైన యేసుక్రీస్తు. మనం కూడా జీవితంలో అబ్రహాము గుణలక్షణములు కలిగి ముందుకు కొనసాగుదాం.

దేవుడు మిమ్ములను ఆశీర్వదించును గాక !

# విత్తనము - ఫలము

| విత్తనము | ఫలము |
|---|---|
| నిజాయితి | నమ్మకత్వము |
| వినయము | ఘనత |
| మంచితనము | స్నేహితులు |
| విశ్వాసము | అద్భుతములు |
| క్షమించుట | సమాధానము |
| ఓర్పు | అభివృద్ధి |
| నిర్మల హృదయము | అన్యోన్యత |
| కష్టపడి పనిచేయుట | విజయము |
| దయ | ఐకమత్యము |
| పట్టుదల | జయము |
| మోసము | అపనమ్మకత్వము |
| స్వార్థము | ఒంటరితనము |
| గర్వము | నాశనము |
| అసూయ | సమస్యలు |
| కఠినము | ఏకాంతము |
| అత్యాశ | నష్టము |
| సోమరితనము | మందస్థితి |
| చింత | క్రుంగుట |
| వ్యర్థమైన మాటలు | శత్రువులు |
| పాపము | అపరాధభావము |



కాబట్టి ఏది విత్తుతున్నాము? అనే విషయములో చాలా జాగ్రత్త కలిగి ఉండాలి. విత్తుట అనగా మనం జీవితంలో కలిగి ఉండే మనస్తత్వం. విత్తే విత్తనం మంచిది అయితే పొందే ఫలములు మంచివిగా ఉంటాయి. కనుక మంచి మనస్తత్వంతో జీవిస్తే మనము మాత్రమే కాక, మన పిల్లలు కూడా మంచి ఫలితములను అనుభవిస్తారు.



# అహంకార గులాబి

– సిస్టర్ వి.విజయ

ఒక అడవిలో అనేక రకములైన మొక్కలు, చెట్లు పెరుగుచూ ఉండేవి. వీటన్నిటి మధ్యలో ఒక ఎర్ర గులాబి మొక్క కూడా పెరుగుచూ, పువ్వులతో అందంగా కనబడుచూ ఉండేది. ఈ పువ్వులను చూచిన దేవదారు వృక్షము ఒకరోజు అబ్బా! ఎంత అందముగా ఉన్నాయి, నేను కూడా వీటి వలె ఉంటే ఎంత బాగుండు అని తన ప్రక్కన ఉన్న మొక్కలతో, చెట్లతో చెప్పింది. వెంటనే మరియొక చెట్టు ప్రియమైన దేవదారు మిత్రమా! నీవు అందంగా లేవు అని విచారపడవద్దు, అందరూ అన్నిటిని కలిగి ఉండలేరు అని చెప్పింది. అంతలో గులాబీ పువ్వు దాని తలను పైకెత్తి, గర్వంగా చుట్టూ కలయచూస్తూ, ఈ అడవి అంతటిలో అందమైన మొక్కని నేనే, ఏదీ లేదు అని చెప్పింది. అంతలో సన్‌ఫ్లవర్ మొక్క దాని తలను పైకెత్తి "నువ్వే అందమైనదానవని నీతో ఎవరు చెప్పారు?" ఈ అడవిలో అందమైన మొక్కలు ఇంకా చాలా ఉన్నాయి వాటిలో నువ్వు ఒక దానివి మాత్రమే అని చెప్పింది. అందుకు గులాబి పువ్వు నన్ను ప్రతి ఒక్కరూ చాలా ఇష్టముగా, ఎంతో ఆసక్తితో గమనిస్తూ ఉంటారు అని తనను తాను గొప్ప చేసుకుంటూ ప్రక్కనే ఉన్న ముండ్ల చెట్టుని చూపిస్తూ, ఈ మొక్కను చూడండి ముండ్లతో ఎంత అందవికారముగా ఉందో, నేను ఈ విధంగా లేను అని ముఖమును వికారముగా చేసుకొని అంది. వెంటనే దేవదారు వృక్షము ఓయీ ఎర్రగులాబి! నువ్వు ఏమి మాట్లాడుచున్నావు? నిజమైన అందము అనగా ఏమిటో నీకు తెలుసా? ఎవరు చెప్పగలరు? నీకు కూడా ముళ్ళు ఉన్నాయి చూసుకో! అని గులాబీకి బుద్ధి చెప్పటానికి ప్రయత్నించింది. అప్పుడు ఎర్రగులాబి కోపంగా దేవదారు చెట్టు వైపు చూస్తూ, "నీకు చాలా మంచి అభిరుచి ఉంది" అని తలంచాను కానీ, అందమంటే ఏమిటో నీకు అస్సలు తెలియకపోగా నన్ను కూడా ఈ అందవిహీనమైన ముండ్ల చెట్టుతో పోల్చుతావా? నీకు ఏమైనా బుద్ధి ఉందా? నేనెక్కడ? ఇదెక్కడ ? అని కోపంతో మిటమిటలాడింది.

ఎర్రగులాబి మాటలన్నీ విన్న మిగిలిన మొక్కలు, చెట్లు అన్నీ కూడా దీనికి ఎంత అహంకారము అనుకున్నాయి. ఈ సంభాషణ జరిగిన తరువాత ఎర్రగులాబి మొక్క ముండ్ల చెట్టు ప్రక్క నుండి ఏ విధముగానైననూ వెళ్ళిపోవాలని ప్రయత్నించి, వేర్లు భూమిలో బలముగా ఉండుట ద్వారా సాధ్యం కాక ప్రయత్నించుట మానివేసింది. ఈ విధంగా దినములు గడుస్తున్న కొలది, గులాబి మొక్క ముండ్లచెట్టుని కించపరుస్తూ, అవమానకరంగా ఇది ఎందుకూ పనికి రాదు, దీని ప్రక్కన నివసించటం నాకు అవమానకరం అని తలంచి మాటలతో హృదయమును గాయపరచుట ప్రారంభించింది. ఇవన్నీ వింటూ, ప్రక్కనే ఉన్న ముండ్ల చెట్టు మాత్రము ఏమీ కలవరపడక, కృంగిపోక నిబ్బరముతో "ఒక ఉద్దేశ్యము

లేకుండా దేవుడు ఏ ఒక్కరినీ సృష్ఠించరు", ప్రతి ఒక్కరి పట్ల ఆయన ఒక ఉద్ధేశ్యమును కలిగి ఉంటారు అని ఎర్రగులాబికి నచ్చచెప్పటానికి ప్రయత్నించేది.

వసంతకాలం ముగిసి, వాతావరణంలో మార్పులు జరిగి, వేసవి కాలం ప్రారంభమయ్యే దశలో అడవిలో మొక్కల, జంతువుల జీవన విధానమునకు చాలా క్లిష్టమైన పరిస్థితులు వాటిల్లి, నీరు ఎంతగానో అవసరమైన పరిస్థితులలో నీరు లేక ఎర్రగులాబి వాడిపోవుట ప్రారంభమయ్యింది. ఒకరోజు కొన్ని పిచ్చుకలు తన ప్రక్కనే ఉన్న ముండ్ల చెట్టుని ముక్కులతో పొడిచి, సేద తీర్చుకొని ఎగిరిపోవుట ఎర్రగులాబి గమనించింది. దానికి ఆ పిచ్చుకలు చేస్తున్నది ఏమిటో అర్ధముకాక, అవి ఏం చేస్తున్నాయి? అని దేవదారు వృక్షమును ప్రశ్నించింది. ఆ పక్షులు ముండ్ల చెట్టు నుండి తమకు అవసరమైన నీటిని తీసుకుంటున్నాయి అని బదులిచ్చింది. పక్షులు ఆ విధంగా పొడిచి, రంధ్రములు చేయుచున్నప్పుడు దానికి బాధగా ఉండదా? అని తిరిగి ప్రశ్నించింది గులాబి. అది చాలా బాధను కలిగించే పరిస్థితే అయినప్పటికి పక్షులు నీరు లేక బాధపడుతూ, చనిపోతుంటే ముండ్ల చెట్టుకి ఇష్టముండదు. తాను బాధని, నొప్పిని ఓర్చుకొని, తనలో ఉన్న నీటిని వాటికి అందిస్తూ ఉంటుంది ప్రతి వేసవిలోనూ ఈ విధముగా జరుగుచూ ఉంటుంది అని దేవదారు వృక్షం సమాధానమివ్వగానే ఎర్రగులాబి కన్నులు తెరుచుకొని, దానిలో నీరు ఉందా ? అని అనుమానమును వ్యక్తపరిచింది. అవును, అది నీటిని కలిగి ఉంటుంది, నీకు కూడా నీరు అవసరమైన పరిస్థితులలో దాని నీటిని త్రాగవచ్చు, ముండ్ల చెట్టుది ఎల్లప్పుడూ సహాయం చేయాలనే మనస్సు, కనుక నువ్వు తప్పక దాని సహాయం కోరితే, పక్షులతో చెప్పి ఆ నీటిని నీకు కూడా ఇప్పించే ఏర్పాట్లు చేస్తుంది అని చెప్పింది దేవదారు వృక్షము.

ఎర్రగులాబి ముండ్లచెట్టుని సహాయం చేయమని అడగటానికి, తాను గతంలో ఆ చెట్టు పట్ల ప్రవర్తించిన తీరు, అహంకారంగా మాట్లాడిన మాటలు, దాని పొరుగుదానిగా ఉండకూడదని చేసిన ప్రయత్నములు అన్నీ గుర్తుకు వచ్చి సిగ్గుపడుచూ, తల వంచుకొని క్షమించమని వేడుకుంటూ, ఎట్టకేలకు సహాయం చేయమని కోరింది. అప్పుడు ముండ్లచెట్టు నేను అందవిహీనమైనదానిని కదా ! అనే మాటలతో తిరిగి గులాబి మొక్కను హింసించాలని ప్రయత్నించక, కనికరముతో ఒప్పుకొని పక్షులు నీటికోసం వచ్చినప్పుడు, వాటికి చెప్పి వాటి ద్వారా గులాబి మొక్కకు నీటిని ఇప్పించగలిగింది. ఆ నీటిని స్వీకరించి ఎంతో సేదను పొందింది గులాబిమొక్క. తరువాత క్షణం నుండి రూపమును బట్టి ఎవరికీ తీర్పుతీర్చకూడదు అనే పాఠమును ముండ్ల చెట్టు నుండి నేర్చుకోగలిగింది ఎర్రగులాబి.

ఈ సంఘటనలో ఎర్రగులాబి తన యొక్క అందము కలిగిన రూపమును బట్టి తనని తాను హెచ్చించుకుంటూ, ముండ్ల చెట్టు యొక్క ఆకారమును బట్టి ఏ విధంగా మాటల

ద్వారా కించపరచిందో మనము గమనించాము. ఇది ఎంత అన్యాయము, మంచిది కాదు అని అనుకుంటున్నాము కానీ మనం కూడా సమాజములో రక రకములైన మనుష్యుల మధ్య జీవిస్తూ ఉంటాము. మనము ఉన్న స్థాయిని బట్టి, మనకి ఉన్న అర్హతలతోను, ఆర్థిక, ఆత్మీయసంబంధమైన పరిస్థితులతోను ఎదుటి వారిని పోల్చుకుంటూ, నాకు అన్నీ మంచి లక్షణములు, మంచి స్వభావము ఉన్నది అని మనల్ని మనము హెచ్చించుకుంటూ, వారిలో ఉన్న లోపములను ఎత్తి చూపించి, మాటలు, ఆలోచనలు క్రియల ద్వారా కించపరిచే వారిగా ఉంటున్నామన్నది వాస్తవమైన విషయము.

బైబిల్ గ్రంథములో అబ్రాము, శారాయి అనే భార్యాభర్తలున్నారు. వారికి పిల్లలు కలుగలేదు, శారాయికి హాగరు అనే దాసి ఉండేది. ఒకరోజు శారా తన భర్తతో దయచేసి నా దాసి వలన పిల్లల్ని కనమని అబ్రాముని అడిగింది. అబ్రాము ఒప్పుకున్నాడు. హాగరు అబ్రాము వలన గర్భవతియైనది. తాను గర్భవతినని హాగరు తెలుసుకున్నప్పుడు శారాయిని నీచముగా చూడటం జరిగింది. కేవలం సంతానం లేదు అనే విషయమును బట్టి తన పైనున్న యజమానురాలు అని కూడా లేకుండా శారాయిని పనికిరానిదానిగా చూడటం ప్రారంభించింది. ఈ రకమైన మనస్తత్వం ఉండుట మంచిది కాదు.

కాబట్టి ప్రియమైన వారలారా ! దేవుడు సృష్టిలో ప్రతి ఒక్కరి పట్ల ఒక్కొక్క ఉద్దేశ్యమును కలిగి ఉన్నారు. ఈ లోకంలో ఎవరిదీ వ్యర్థమైన జీవితం కాదు, ఎవరికి వారే వేరు వేరు మనస్తత్వములు గలవారు, ఏ ఇద్దరూ ఒకే విధంగా ఉండలేరు, ఎవరికి వారే ప్రత్యేకత గలవారు. మనలో అన్నీ మంచి లక్షణములు ఉండి, ఒక్కటే లోపం ఉన్నప్పుడు అది లోపంగా అనిపించదు కానీ, ఎదుటి వారిలో ఉన్న ఒక్క లోపమే ఎంతో పెద్దదిగా మన కళ్ళకి కనిపిస్తుంది. కాబట్టి ఏ విషయములోనూ మనల్ని మనము హెచ్చించుకొని, ఎదుటివారిలో లోపములను మాత్రమే చూడక, మనల్ని మనం తగ్గించుకున్నప్పుడు ఎదుటి వారిలోని మంచి లక్షణములు మనకి కనబడతాయి. కనుక మనల్ని మనం తగ్గించుకొని, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును అన్న దేవుని వాగ్దానము యొక్క నెరవేర్పును చూద్దాము. అట్టి కృప దేవుడు మనకి అనుగ్రహించును గాక !

**"హ్యాపీ హ్యాపీ"** అను ఆడియో పాటల సీడి కావల్సిన వారు మమ్ములను సంప్రదించగలరు.

**బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628**

# విజయమునకు సూత్రములు

ప్రతి మనిషి విజయం సాధించాలని కోరుకుంటాడు, కానీ కొందరే విజయం సాధించడానికి కారణం మనం చేయవలసిన భాగం చేయకుండా, మన భాగమును కూడా దేవుడే చేయాలని భగవంతుడిపై భారం వేసి కూర్చోవడం. దేవుడు మనం ఏమి చేయాలని కోరుకుంటున్నాడో వాటిలో సామాన్యమైన కొన్ని విషయములను తెలుసుకుందాము.

**1. ఎప్పుడూ ఆలస్యము కావద్దు :**

సమయపాలన అనేది విజయమునకు ఒక మెట్టు కానీ దుఃఖకరమైన విషయమేమిటంటే ఆయా కార్యక్రమములకు ఆలస్యముగా రావడం, ప్రజలు వారికోసం వేచి చూడడం నాయకులు గొప్పతనంగా భావిస్తున్నారు. కొంతమంది క్రైస్తవ నాయకులైన వారిలో కూడా ఈ జాడ్యం కనిపిస్తుంది. ఈ లోకంలో సమయం ఎంతో విలువైనది. నాయకులకు సమయపాలన లేకపోవుట వలన ప్రజల యొక్క లక్షల పనిగంటలు వ్యర్థమై పోవుచున్నాయి. తద్వారా దేశాభివృద్ధికి విఘాతం కలుగుతుంది. కావున చిన్నతనం నుండే పిల్లలకు సమయపాలన నేర్పించే పెద్దలుగా ఉండాలి. విజయములో టైమ్ మెయిన్‌టైన్ చేయడం ఎంతో కీలకమైనది. So never be late.

**2. సామాన్యమైన జీవితం :**

జీవితములో అధికారం చలాయించుట, ఆడంబరముగా కనబడుట అధికమవుతున్న దినములలో సామాన్యమైన జీవితమనేది ఎంతో ప్రత్యేకమైనది. ప్రపంచవ్యాప్తంగా అనేక రంగములలో అభివృద్ధి చెందిన వారిని మనము పరిశీలిస్తే, సామాన్యమైన జీవితము జీవించిన వారు అనేకులు కనబడతారు. తనని తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును అనిబైబిల్ గ్రంథములో వ్రాయబడి యున్నది. So live simple.

**3. తక్కువ ఆశించు :**

ఏదైనా పని చేసినప్పుడు మనం పొందే ప్రతిఫలమైనా, మనుష్యులు మన స్థితికి ఇచ్చే గౌరవమైనా, తక్కువ ఆశించడం ఎంతో ముఖ్యం. ఎందుకనగా ఎక్కువ ఆశించి, తక్కువ పొందితే దుఃఖము, అసంతృప్తి కలుగుతాయి. ఇవి విజయమునకు అడ్డుబండలు. So expect little.

**4. ఎక్కువ పని చేయి :**

పనివాడు జీతమునకు పాత్రుడు అని బైబిల్ గ్రంథము చెప్పుచున్నది. కొన్నిసార్లు సమాజములో కష్టమనకు తగిన ప్రతిఫలం దొరకక పోవచ్చు కానీ కష్టపడే మనస్తత్వం

ఉన్నవారిని విజయం తప్పకుండా వరిస్తుంది. So work more.

**5. ఎప్పుడూ నవ్వుతూ ఉండు :**

ఎప్పుడూ నవ్వుతూ ఉండుట అనేది గొప్ప విషయం. నవ్వుతూ ఉండుట ఆరోగ్యమునకు మంచిదని ఈ మధ్య లాఫింగ్ క్లబ్‌లు కూడా పెట్టడం వింటూ ఉన్నాము. నవ్వు ఆరోగ్యానికి మంచిదో, కాదో కానీ మనము నవ్వుతూ ఉండుట ద్వారా ఎదుటి వ్యక్తులలో సహృదయ భావం కనబడుతుంది. ఈ మధ్య ఇద్దరు యౌవనస్తులు ఒకరిపై ఒకరు చేయి చేసుకుంటూ, ఒకరిని ఒకరు దూషించుకుంటున్నారు. కారణం అడిగితే నా వైపు సీరియస్‌గా చూస్తున్నాడు అని ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. కనీసం వారిలో ఒకరి ముఖమైనా నవ్వుతూ ఉన్నట్లైతే ఈ క్లిష్టమైన పరిస్థితి వచ్చేది కాదు. విజయమునకు సహృదయ భావం ఎంతో అవసరం. So smile always.

**6. అనుకూల ధోరణితో ఆలోచించుట :**

జీవితములో ప్రతి విషయమును అనుకూలముగా ఆలోచించుట మనలను విజయము వైపుకు నడిపిస్తాయి. ప్రతిదినమూ ఎక్కువ శాతం మంది అనుకూల ధోరణి కంటే ప్రతికూల ధోరణిలోనే ఉంటారు. ఎదుటి వారి మాటలలో తప్పుడు భావములను తీసుకుంటూ, పొరుగువారి పనులను వ్యతిరేకభావముతో అర్థం చేసుకుంటూ, కనుమూసినా, తెరిచినా ప్రతికూల భావముతో భ్రమిస్తూ ఉంటారు. ఈ ప్రతికూల ధోరణి విజయమునకు అడ్డుగోడగా నిలుస్తుంది. So think positive

**7. వాదించవద్దు :**

రెండు వైవిధ్యమైన మనస్తత్వముల మధ్య పుట్టేదే వాదన. వాదించుకొనుట అనేది ఏ విధంగా చూచినా మంచిది కాదు. నాకు తెలిసిందే కరెక్ట్ అని భావించుకునే వారి వలన వాదనలు జరుగుచూ ఉంటాయి. ప్రతి మనుష్యుడు ఎదుటి వ్యక్తి మనస్తత్వ విధానమును గౌరవించుట ద్వారా వాదించుకొనుట అనే దానిని ఆపగలడు. విజయం పొందటానికి వాదించుట ఏ మాత్రమూ ఉపయోగపడదు. So Don't Argue

**8. ఆత్మ విశ్వాసమును కలిగి స్నేహ భావముతో మెలుగుట :**

విజయం పొందడానికి ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమైనది. కొందరు నాకేమీ తెలియదు, నా వల్ల ఏమీ కాదు అనుకుంటూ ఆత్మనూన్యతా భావంతో జీవిస్తారు. మరి కొందరు అన్నీ నాకే తెలుసు, నాకు తెలిసినంత ఎవరికీ తెలీదు అనే అతి విశ్వాసంతో జీవిస్తూ ఉంటారు. పై రెండు లక్షణములు ఆత్మవిశ్వాసమునకు వ్యతిరేకము. మనకి తెలిసిన విషయములను బట్టి ధైర్యంగా ఉంటూ, ఎదుటి వారితో స్నేహపూర్వకమైన వాతావరణమును ఏర్పరచుకోవాలి. తద్వారా విజయమునకు చేరువ కాగలుగుతాము. So be confident & friendship nature.

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

– సీరియల్ 9వ భాగము



సిక్కులకుండే ఐదు గుర్తులలో పొడవాటి జుట్టే ప్రధానం. దానిని తలపైకి లాగి వేసే శిఖముడి వారికి అతిశయ కారణం. అది లేకుండా మిగిలిన నాలుగూ ఉన్నా, లేకపోయినా ఒకటే. వారు తల వెంట్రుకలనెన్నడూ కత్తిరించుకోకూడదని పవిత్ర గ్రంథ్ ఉద్భోధన. నిష్ఠగల సిక్కుగా అతడెన్నడూ ఇలాంటి పని చేయలేదు. ఏపుగా పెరిగిన గడ్డం వలన దుమ్ముతో కూడిన వేసవిలో ఎంతో అసౌకర్యంగా ఉన్ననూ క్షౌరం చేసేవాడు కాదు. అయితే తలపై పొడవుగా పెరిగిన జుట్టే వీటన్నింటిలో ప్రధానమైనది. సిక్కులలో ఎవరైననూ జుట్టు కత్తిరించుకొన్నట్లైతే ఆ మీదట అతనిని సిక్కుగా పరిగణించరు. తమ మతం నుండి, సమాజం నుండి, కుటుంబం నుండి అతనిని వెలివేస్తారు.

సుందర్ జుట్టుని కత్తిరించుకొన్నప్పుడు అతను చేసిన పనిని బట్టి షేర్సింగ్ ఎంతో అదిరిపోయాడు. ఆయన కోపం కట్టలు తెచ్చుకుంది. తన తండ్రికి అంత కోపం రావడాన్ని అంతకు ముందెప్పుడూ చూచి యుండలేదు సుందర్. రౌద్రుడైన తండ్రి " నీవింక ఏ మాత్రమూ మా కుటుంబమునకు చెందిన వాడవు కావు. ఈ ఆవరణంలో నుండి వెళ్ళిపో !" అని ఖరాఖండిగా చెప్పాడు. ఇప్పుడు సుందర్ వెలివేయబడిన వాడు. ఆ సింగ్‌ల ఆవరణములో ఉండటానికి హక్కులేని వాడు. తండ్రి ఆజ్ఞకు లోబడడం తప్ప వేరే గత్యంతరం లేదని తనకు తెలుసు గనుక కట్టుబట్టలతో తన క్రొత్త నిబంధన చేతబట్టుకొని ఎక్కడికి వెళ్ళాలో, ఏం చేయాలో తెలియని వాడై ఆ ఆవరణంలో నుండి బయటికి వెళ్ళిపోయాడు. సుందర్ చేసిన పని ఆ గ్రామమంతా వ్యాపించింది. ఇప్పుడు అతను ఒక వెలివేయబడిన వాడు గనుక ఎవ్వరూ తమ ఇంట్లోకి రానివ్వరు, నీళ్ళివ్వరు, తమ శుభకార్యములకు గాని, మామూలు సమావేశములకు గాని రానివ్వరు.వెలివేయబడిన వారు అంటుకుంటే మైల పడుతుందనే భావంతో త్రాగడానికి నీళ్ళు కూడా ఇవ్వరు. అలా జరుగుతుందని సుందర్‌కు అంతకు ముందే తెలుసు. వీధులు ఊడ్చే పాకీ వారిని, వెలివేయబడిన వారిని, హిందువులు, సిక్కులు ఇలాగే చూడడాన్ని అంతకుముందు ప్రతిరోజు చూచేవాడు సుందర్. అయితే ఇప్పుడు ఈ విధమైన నిరాదరణను తానే స్వయంగా అనుభవిస్తున్నాడు. ఒక రకంగా చూస్తే తన కంటే వారి పరిస్థితే కొంత మెరుగని చెప్పవచ్చు. ఆ పాకీ వారికి వారి కులం, వారి ప్రాంతం వారికుంది. వారంతా ఒకే చోట కలిసి ఉంటారు. పేదరికమునకు, ఈ రకమైన తృణీకారానికి

వీరు అలవాటు పడ్డారు కాని సుందర్ ఏకాకి ఎటు పోదామన్నా చేర్చుకునే వారు లేరు.

ఓ చెట్టు క్రిందికి వెళ్ళి దాని నీడను కూర్చున్న సుందర్‌లో కొంచెం వణకు ప్రారంభమయ్యింది. దీనికి ముందెన్నడూ ఇలా భోజనంగాని, వసతిగాని, సరిపోయినన్ని బట్టలు గానీ లేకుండా ఎన్నడూ వుండలేదు సుందర్.

తన కుటుంబము ఉన్న ఇంటిలోని వెచ్చదనము, భోజనం దగ్గర అందరూ గుండ్రంగా కూర్చొని తినడం, తన గదిలో నున్న దుప్పట్లు, పరుపు, తలగడలు, తనకెంతో సుపరిచితమైన వన్నీ సుందర్‌కి గుర్తుకు రాసాగాయి. చెట్టు క్రింద తాను కాళ్ళు ముడుచుకొని కూర్చున్న స్థలానికి ఈ సౌకర్యాలన్నీ ఎంతో దగ్గరలోనే ఉన్నాయి. అయితే వీటన్నిటి నుండి దూరమైపోయాడు సుందర్. వీటన్నింటిని గుర్తించినపుడు దిగులు పుట్టుకు రావడానికి బదులుగా ఇవన్నీ తనపై విభిన్న ప్రభావమును చూపడం గుర్తించాడు. శారీరకంగా అతడెంతో శ్రమననుభవించుచున్నప్పటికిని, తన మనస్సులో ఎంతో శాంతి, చెప్పనశక్యమైన ఆనందమును అనుభవించగలుగుచున్నట్లు తెలిసికున్నాడు. సంవత్సరం క్రితం సజీవుడైన క్రీస్తును తాను కళ్ళారా చూచిన ఆ మరపురాని రాత్రి దొరికిన సంతోష సమాధానముల కంటే ఇది ఎంతో భిన్నంగా ఉంది. ఇప్పుడు తన కళ్ళ ముందెవ్వరూ లేకున్నప్పటికిని క్రీస్తు సన్నిధి తనకు తోడుగా నున్నదన్న గ్రహింపుతో హృదయం నిండిపోయింది. మరి దేని కోసం కూడా ఈ ప్రస్తుత పరిస్థితిని సుందర్ వదులుకునేవాడు కాడు. సకల సౌకర్యములతో ఆడంబరంగా ఉండే తన ఇంట్లో శారీరకంగా ఏ లోటూ ఉండేది కాదు గాని మనసంతా కల్లోలంగా ఉండేది. ఇప్పుడైతే పైకి చూస్తే ఎంతో వేదనలో ఉన్నట్లుగా ఉండినా హృదయంలో మాత్రం తన ప్రభువుతో ఎంతో సన్నిహితంగా ఉన్నాడు. పరలోకంలో ఇది నా మొదటి రాత్రి అని చెప్పేటంతగా ఆ రాత్రి దేవుని పొందు ననుభవించాడు. ఆధ్యాత్మిక జీవితంలో క్రొత్త పుంతలు తొక్కాడు సుందర్. తన ప్రభువు కోసం మాత్రమే గాక ప్రభువుతో కలిసి తాను కూడా శ్రమననుభవించుచున్నానని తలంచుచూ హెబ్రీ 11:26 లో నున్న “ఐగుప్తు ధనము కంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని” యెంచడంలోని భావమేమిటో తెలిసికొన్నాడు. అయితే తెల్లవారగానే జీవితంలోని వాస్తవ పరిస్థితిని అతడెదుర్కొనక తప్పదు. గ్రామంలోని ఆ చెట్టు క్రిందే యెల్లకాలము ఉండలేడు, ఎక్కడికి వెళ్ళాలో యేం చేయాలో సుందర్‌కి తోచలేదు. అక్కడ ఎవరి దగ్గరకైనా వెళ్ళడం జరిగితే సిక్కుల ఇంటికే వెళ్ళాలి గానీ వారు తనను చేర్చుకోరు, రానివ్వరు. హిందువులను, మహమ్మదీయులను సహాయ మర్థించే ప్రసక్తే లేదు గాబట్టి చివరికో నిర్ణయానికి వచ్చాడు సుందర్.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)

# జిమ్మి అండ్ ది ఏంజిల్



Hellow! పిల్లలూ బావున్నారా? tension పడిపోతున్నారేంటి? Exams వ్రాయాలనా? time అంతా వేస్ట్ చేశాము ఇప్పుడు ఎలా అని బాధపడుతున్నారు కదూ! ఏ time లో చేయవలసింది ఆ time లోనే చేయాలి.

ఒకరోజు జిమ్మి అనే బాలుడు ఎడారిలో నడుచుకుంటూ వెళ్ళుచుండగా, విచిత్రమైన వెలుగు కనిపించింది. దేవదూత ఏదైనా వచ్చి, నాకున్న కోరికలు తీరుస్తుందేమో అనుకున్నాడు. ఆశ్చర్యకరంగా దేవదూత ప్రత్యక్షమయ్యాడు. జిమ్మి తనకు వరాలు ఇవ్వమన్నాడు. ఆ దేవదూత నేను వరాలు ఇచ్చేవాడిని కాదు, నీకు సలహా ఇస్తాను అన్నాడు. Oh! సలహా ఇవ్వమని అడిగాడు. దేవదూత అదృశ్యం అయ్యేముందు మీ ఇంటికి ఎన్ని రాళ్ళని తీసుకు వెళ్ళగలిగితే అన్ని తీసుకువెళ్ళమన్నాడు. ఈ రాళ్ళని ఏం చేసుకుంటాను అని దూత మీద కోపం తెచ్చుకున్నాడు.

ఛీ! ఇది ఒక చెత్త సలహా అని జిమ్మి మనసులో గొణుక్కుంటూ, మా ఇల్లు దూరం, రాళ్ళు బరువుగా ఉంటాయి అనుకుంటూ చిన్న రాయిని తీసుకుని జేబులో వేసుకున్నాడు. చివరికి ఇల్లు చేరి, ఆ మురికి బట్టలు విడిచి, స్నానం చేసాడు. వాళ్ళ మమ్మి బట్టలు వాష్ చేస్తూ, జేబులో రాయి ఎక్కడిది? అని అడిగింది. జిమ్మి సమాధానము చెబుతూ ఓ అదా! ఒక దేవదూత చాలా రాళ్ళు తీసుకువెళ్ళమని, చెప్పాడు కానీ నేను ఒక్కటే తీసుకు వచ్చాను అని చెప్పాడు.

జిమ్మి వాళ్ళ అమ్మ ఏడవడం మొదలెట్టింది. అరే! ఇది రాయి కాదు, మంచి డైమండ్ లక్షల రూపాయల విలువ చేస్తుంది అని చెప్పింది. జిమ్మి ఎంత ప్రయత్నించినా అలాంటి రాళ్ళు మరల ఎప్పుడూ కనబడలేదు. అయ్యో వాటి విలువ తెలిసి ఉంటే చాలా తీసుకునే వాడిని అని అనుకుని దేవదూత సలహా పాటించనందుకు చాలా బాధపడ్డాడు.

చూశారా! పిల్లలూ! జిమ్మి దూత చెప్పినది చెత్త సలహా అనుకొని రాళ్ళు తెచ్చుకోనందుకు చాలా బాధపడవలసి వచ్చింది. ఆ రాళ్ళ విలువ తెలిసి ఉంటే జిమ్మి ఒక్క రాయి కూడా విడిచి పెట్టేవాడు కాదు. ఆ విధంగానే చిన్నవారైనా మీరు చదువుకుని ప్రయోజకులు కావాలని, జ్ఞానవంతులు కావాలని తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆకాంక్ష. కానీ మీకు వారి సలహా ఎంత మాత్రమూ నచ్చక timepass చేస్తుంటారు. ఇప్పుడు చదువు కోవటానికి time లేదని బాధపడతారు. మీకు చదువు విలువ తెలిస్తే బాగా చదువుకుంటారు. ఇప్పుడు కష్టంగా ఉందని చదవడం మానేస్తే తర్వాత చదువుకోలేరు. కాబట్టి నిర్లక్ష్యం మాని శ్రద్ధగా చదువుకోండి. తర్వాత మీరు ప్రయోజకులవుతారు.

జీవితంలో చాలా విషయములు రాళ్ళ వలె ఉంటాయి. కానీ వాస్తవమునకు రాళ్ళు కాదు, డైమండ్స్. ఉదాహరణకు చదువుకునేటప్పుడు చదవడం, ఎగ్జామ్స్ వ్రాయడం చాలా కష్టంగా ఉంటుంది అలాగే దేవుని వెంబడించడం, విధేయత చూపించడం చాలా కష్టతరమైనవిగా ఉంటాయి. కానీ ఒక రోజున పరలోకంలో దేవుడు అనుగ్రహించబోయే కిరీటములో అవి మనకి డైమండ్స్‌గా మారతాయి. చదువుకునే time లో చదువుతారుగా good luck.

- మీ అక్కయ్య

 దేవుని పనిని అజాగ్రత్తగా చేయువాడు, చేయనివానికంటే దరిద్రుడు. 

# "నా జీవితములో దేవుని మేలులు"

**- ప్రేమ్ కుమార్, మహబూబ్‌నగర్ జిల్లా**

నా పేరు పి.ప్రేమ్ కుమార్, మహబూబ్ నగర్ జిల్లా, ముష్టిపల్లి గ్రామము, అయినా మేము చిన్నతనం నుండి హైదరాబాద్‌లో ఉండేవారం.


మా ఇంట్లో నేను చిన్నవాడిని, 7 సం॥ల వయస్సులో తల్లి చనిపోయింది. అప్పటి నుండి నన్ను ఒక ఇంట్లో పని చేయటానికి పెట్టారు. ప్రతి సంవత్సరం జీతం తీసుకువెళ్ళిపోయే వారు కానీ, నేను ఎలా ఉన్నానని కూడా అడిగేవారు కారు. పని చేసే ఇంట్లో ఎవరికి కోపం వచ్చినా నన్నే తిట్టేవారు, వాళ్ళు వాళ్ళు పోట్లాడుకొని ఆ టెన్షన్‌లో నన్ను కొట్టేవారు. చిన్నప్పటి నుండి ఇవన్నీ అనుభవిస్తూ, మనుష్యులంటే ద్వేషం ఉండేవాడిని. నాకు ఎవరూ లేకున్నా దేవుడు ఉన్నాడని నమ్మేవాడిని, పూజలు చేస్తూ ఉండేవాడిని. పనిచేసే ఇంటిలో గొడవలు పడి నాకు అన్నం సరిగా పెట్టేవారు కాదు. జీవితంలో నిరాశ, చింతలతో బ్రతుకుతుండేవాడిని. ఆ వయసులోనే నేను పని చేసే ఇంట్లో వాళ్ళులేనపుడు సీసాలో నుండి బ్రాందీని కొంచెము, కొంచెము తీసి త్రాగుచుండేవాడిని. ఒకరోజు జీవితం మీద విరక్తితో ఎక్కువ త్రాగేస్తే చచ్చిపోతానని, ఎక్కువ త్రాగేశాను. నా మత్తు దిగేసరికి, ఎందుకు త్రాగావని ? ఇంట్లో వాళ్ళు బాగా చితకబాదారు. చావు కూడా నా దగ్గరకు రావట్లేదని బాధపడే వాడిని. 15వ సం॥లో నేను చేస్తున్న పని మానేసి, మా అన్నయ్య వాళ్ళ ఇంటికి వెళ్ళాను. మా వదిన దరిద్రుడా ! నువ్వు పుట్టిన తరువాత మీ అమ్మ చనిపోయింది, మా ఇంటికి వచ్చావా అని తిడుతూ ఉండేది. మా అన్నయ్య ఈ పరిస్థితి చూచి, తాపీ పని చేసే మేస్త్రీ దగ్గర జీతమునకు పెట్టాడు. సిమెంట్ పని అలవాటు లేక చేతులు పుండ్లు పడి, రక్తము కారి అన్నం తినటానికి కూడా ఇబ్బందిగా ఉండేది. నేను పనిచేసే మేస్త్రీ ఇంట్లో భార్యాభర్తలు పోట్లాడుకొని నాకు భోజనం పెట్టేవారు కాదు. ఎప్పుడైనా లేటుగా వస్తే గంజి పోసి పెట్టేవారు. బ్రతికినా, చనిపోయినా ఒకటే అని ఆలోచిస్తూ, త్రాగుచూ, సినిమాలు చూస్తూ తిరుగుతుండే వాడిని. ఆ సమయంలో మా నాన్న చనిపోవడం జరిగింది. నేను పనికి వేరొక మేస్త్రీ దగ్గర చేరాను, వాళ్ళు ప్రతి ఆదివారం చర్చికి వెళ్ళేవారు, నన్ను కూడా రమ్మనేవారు. నేను వాళ్ళకు ఎదురు ప్రశ్నలు వేస్తూ, మా అమ్మా, నాన్న ఎందుకు చనిపోయారు, దేవుడు ఉంటే ? అని అడిగేవాడిని.

నేను ఉంటున్న ఇంటి ప్రక్కన ఒకరోజు ప్రార్థన జరుగుతుంది. అబ్రాహాముకి 100 సం॥ల వయస్సులో దేవుడు కుమారుని ఇచ్చాడు, దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదు అని చెప్పారు. ఆ మాటలు రోజూ నాకు గుర్తుకు వచ్చేవి. ఒకరోజు చూద్దామని చర్చికి వెళ్లాను. నీ తలవెంట్రుకలన్నియు లెక్కింపబడియున్నవి గనుక మీరు భయపడకుడి అని వాక్యము

చెప్పారు. దేవుడు ఎప్పుడు నా తలవెంట్రుకలు లెక్కపెట్టాడు అని అనుకునే వాడిని. మరల ఆదివారం చర్చికి వెళ్ళాను. ఆయనకు ప్రార్థన చేయువారందరికి సహాయం చేసే దేవుడు యేసుప్రభువని ఎపఫ్రా అన్నయ్య వాక్యము చెప్పారు.

వాక్యము విన్న తరువాత అందరూ ప్రార్థన చేసుకుంటున్నారు. నేను కూడా ప్రభువా ! త్రాగుడు, గుట్కాలు తినడం వంటి దుర్వ్యసనముల నుండి మార్పు చెందటానికి సహాయం చేయమని అడిగాను. ఆ తరువాత దుర్వ్యసనముల జోలికి పోకుండా దేవుడు నాకు మారుమనస్సు దయచేశారు. నేను అడిగింది దేవుడు నాకు ఇచ్చాడు అని సంతోషం కలిగింది. నా బంధువులు, స్నేహితులు చర్చికి వెళ్ళవద్దు అని అనేవారు. నా జీవితమును మార్చిన దేవునిని నేను విడువలేదు. ఈ వయస్సులో నీకు బాప్తిస్మం ఎందుకు ? అని చెప్పుచూ ఉండేవారు. వారి మాటలు వినకుండా, బైబిల్ వాక్య ప్రకారం బాప్తిస్మం పొందటం జరిగింది. అప్పటి నుండి ఆత్మీయ జీవితంలో దేవుడు ముందుకి నడిపిస్తున్నాడు.

ముఖ్యముగా నా తోటి యౌవనస్తులు, వారు చూపించే ప్రేమ, ఐక్యత, తగ్గింపు నా జీవితము మీద ఎంతో ప్రభావమును చూపించాయి. గడిచిన సంవత్స రములో పరిచర్యలో పెద్దలు నిర్ణయించిన వివాహము చేసుకోవడానికి దేవుడు సహాయం చేసారు. ఇన్ని మేలులు చేసి నన్ను ధన్యుడిగా చేసిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను.



# ఇది తెలుసా?

## (హైతి)

హైతి ప్రపంచంలోని పేద దేశములో ఒకటిగా గుర్తించబడింది. ఇది అభివృద్ధి చెందని ,దారిద్ర్య దేశము.

(హైతి)

| | | |
|---|---|---|
| **రాజధాని** | : | పోర్ట్‌వా ప్రిన్స్ (పెద్ద పట్టణము) |
| **జనాభా** | : | 9,035,536 |
| **ప్రెసిడెంట్** | : | రేని ప్రేవాల్. |

1. ఇంచుమించుగా 80 శాతము మంది ప్రజలు దారిద్ర్యంలో జీవిస్తున్నవారు.
2. దినసరి ఆదాయము 100 రూపాయల కన్నా తక్కువగా ఉన్నవారు అనేకులు.
3. 50 శాతము మంది ప్రజలు వ్యవసాయము మీద ఆధారపడేవారు, అయితే ప్రకృతి సిద్ధంగా సంభవించే పరిణామముల వలన సరియైన ఆదాయములు లేక ఆహారం విషయంలో ఎంతో సంక్షోభము కలిగి, ఆహారం కొరకు లూటీలు జరుగుచున్నాయి.
4. ఈ దారిద్ర్యత, ఆహారము లేని పరిస్థితులు పిల్లలను బానిసలుగా, నేరాలు చేస్తూ, వీధుల్లో అడుక్కుతినే వారిగా మాత్రమే కాక, జీతం లేకుండా అనగా కేవలం వారు పెట్టే ఆహారం కోసం ఇళ్ళల్లో వెట్టి చాకిరి చేసేవారిగా మారుస్తున్నాయి.
5. 50 శాతము మంది ప్రజలు నిరక్షరాస్యులుగాను, దాదాపు 70 శాతము మంది ప్రజలు నిరుద్యోగులుగాను ఉన్నారు.
6. 2010, జనవరిలో కలిగిన భూకంపము వలన ఆస్తి నష్టం మాత్రమే కాక, ప్రాణ నష్టం కూడా కలిగింది. అంతేకాక అనేకమంది ఇళ్ళను కోల్పోయి నిరాశ్రయులుగా మారారు.
7. ఆరోగ్య సంబంధమైన విషయములలో సగము మంది ప్రజలు సరియైన అవగాహన లేక పిల్లలకు వ్యాక్సిన్స్ లేకుండా జీవించుట ద్వారా, అపరిశుభ్రమైన నీటియొక్క వాడకం ద్వారా సంభవించే వ్యాధులతోను, వాటర్‌బోర్న్ మరియు డయేరియా వ్యాధులు మాత్రమే కాక జీర్ణకోశ సంబంధ వ్యాధులతో కూడా పీడించబడుతున్నారు.
8. హెచ్.ఐ.వి.తో బాధపడే వారి సంఖ్య ఎక్కువ. ఇతర దేశములతో పోల్చుకుంటే టి.బి, మలేరియా జ్వరములతో ప్రతి సంవత్సరము బాధపడేవారు అనేకమంది.
9. సగటున మనిషి జీవించు సంవత్సరములు

పురుషులు - 50 సం॥లు స్త్రీలు - 52 సం॥లు

ఈ దారిద్ర్యత పరిస్థితుల నుండి దేవుడు ఈ దేశమును విడిపించి, అభివృద్ధి చెందించమని భారం కలిగి ప్రార్థిద్ధామా !

# నిజమైన పరీక్ష

రాజులు రాజ్యములను పరిపాలిస్తున్న కాలములో చాణక్య అనే రాజు తన రాజ్యమును తెలివితో, మంచి ప్రవర్తనతో సమర్ధవంతంగా పరిపాలన చేస్తూ ఉన్న దినములలో రాజు వద్దకు మంత్రి వచ్చి ఈ విధముగా అడిగాడు. రాజా! నేను మీ స్నేహితుని గురించి కొన్ని విషయములను విన్నాను, తమరు సెలవిస్తే వాటిని తెలియ పరచాలనుకుంటున్నాను. అప్పుడు రాజు మంత్రితో మీరు చెప్పే విషయములను వినే ముందు వాటిని మూడు ప్రశ్నల ద్వారా పరీక్షిస్తాను అన్నాడు.

**మొదటి ప్రశ్న**

**రాజు :** నువ్వు నా స్నేహితుడి గురించి చెప్పాలనుకున్న విషయములలో నిజం ఉందా?

**మంత్రి:** తెలియదు, నేను వాటిని ఎక్కడి నుండో విన్నాను.

**రెండవ ప్రశ్న**



**రాజు:** నా స్నేహితుడి గురించి చెప్పబోయే మాటలు మంచి అభిప్రాయమును కలిగించేవేనా?

**మంత్రి:** కాదు, అవి చెడ్డ అభిప్రాయమును కలిగించేవి.

**మూడవ ప్రశ్న**

**రాజు:** నా స్నేహితుడి గురించి చెప్పే సంగతులు దేనికైనా ఉపయోగపడతాయా ?

**మంత్రి:** ఏ మాత్రమూ ఉపయోగపడేవి కావు.

చివరకు రాజు నువ్వు నాకు చెప్పాలనుకుంటున్న విషయములలో నిజం ఉందో లేదో తెలియదు, అవి చెడ్డ అభిప్రాయమును కలిగించేవి, ఉపయోగపడే సంగతులు కూడా కావు మరి నాకు ఎందుకు చెప్పడం? అని ప్రశ్నించాడు.

చూశారా! విషయం చెప్పాలనుకొని వచ్చిన మంత్రి రాజు అడిగిన ప్రశ్నలకు ఏ విధంగా భంగపడ్డాడో! మనము కూడా అనేకసార్లు ఏదైనా విషయమును, ఎవరితోనైనా చెప్పేటప్పుడు వారు కూడా మనలను పై మూడు ప్రశ్నల ద్వారా పరీక్షిస్తే, ఎన్నిసార్లు భంగపోతామో ఆలోచించండి. కనుక ఏ విషయమునైననూ చెప్పడానికి, వినటానికి ముందు దానిలో నిజం ఎంత ఉంది? మంచి అభిప్రాయం ఉన్నవేనా? ఉపయోగపడేవేనా? అనే ప్రశ్నల ద్వారా పరీక్షించుకొనుట అనేది అవసరము.




# ఆత్మ ఫలము - 7వ భాగము

- ఎడిటర్

**ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, విశ్వాసము, మంచితనము, సాత్వికము, ఆశానిగ్రహము.**

**ఆత్మ ఫలములో నాల్గవది దీర్ఘశాంతము**

**దీర్ఘశాంతము** అనగా జీవితములో ఏది సంభవించిననూ దీర్ఘకాలము సహించగల శక్తిని కలిగి ఉండుట. ఎదుటి వారి పట్ల ప్రేమను కనుపరచుటకు సహనము కలిగి ఉండుట ఒక గొప్ప మార్గము. దేవుని ఏర్పాటులో ఉన్నవారు దీర్ఘశాంతమును కలిగి ఉండవలసిందిగా పౌలు భక్తుడు కొలస్సీ సంఘమును హెచ్చరించుట కొలస్సీ 3:12లో మనము గమనిస్తున్నాము. ఎదుటి వారి బలహీనతలను, తప్పిదములను సహించుకొని ఉండటం కూడా దీర్ఘశాంతములో ఒక భాగము. మనలను అవమానపరిచినా, మన పనులకు ఆటంకము కలిగించినా ఓర్పుని కలిగి ఉండవలెను. మన అనుదిన జీవితములో దీర్ఘశాంతము అనే ఫలం అనేకసార్లు వినియెగించవలసి ఉంటుంది. పొరుగువారిపట్ల కలుగుచున్న విరోధమైన భావములను నియంత్రించుకొనవలసిన వారమై ఉన్నాము.

**<u>దీర్ఘశాంతమునకు కొన్ని ఉదాహరణలు:-</u>**

1. ఉదయమునే నిద్ర నుండి లేచిన తరువాత నీకు అవసరమైన ఆహారం, వస్త్రములు సిద్ధం చేయకుండా అవి లేవు, ఇవి లేవు, అని చెబుతున్న నీ భార్య పట్ల దీర్ఘశాంతమును కలిగి ఉండుము.

2. ఆఫీసు నుండి ఇంటికి వచ్చి, ఇంటి పని గాని, పిల్లల బాధ్యత గానీ ఏ మాత్రం పట్టించుకొనకుండా, టి.వి చూస్తూ, కాలక్షేపం చేస్తూ నీవు ఎన్నిసార్లు చెప్పినా మారని నీ భర్త యెడల దీర్ఘశాంతమును కలిగి ఉండుము.

3. మీ దగ్గర పనిచేస్తున్న వారిలో ఎవరైనా, ఆశించిన రీతిలో పనిచేయక పోయినప్పుడు ఎన్నిసార్లు శిక్షణ ఇచ్చినప్పటికీ మార్పు రాని వారి పట్ల దీర్ఘశాంతమును కలిగి ఉండుము.

4. నీ వలన ఎన్నో మేలులు పొంది, నిన్ను దూషిస్తూ, కృతజ్ఞత లేకుండా ఉన్న వారి యెడల దీర్ఘశాంతము కలిగి ఉండుము.

5. బస్సు, ఆటో, రైలు ప్రయాణములలో కూర్చునే స్థలముల విషయములో అన్యాయముగా ప్రవర్తిస్తున్న వారి పట్ల దీర్ఘశాంతమును కలిగి ఉండుము.

- (ఇంకావుంది)




# గిలాదు కొండ

యాకోబు మరియు లాబానులు తమ మధ్య నిబంధనను ఈ కొండపై చేసినట్లుగా బైబిల్ గ్రంధము తెలియ జేస్తుంది. ఈ కొండ గలిలయ సముద్రము నకు ఆగ్నేయముగా కలదు.

యాకోబు తన మామయైన లాబాను ఇంట నుండి బయలుదేరి, లాబానునకు తెలియచేయక నది దాటి గిలాదు కొండ తట్టు అభిముఖుడై వెళ్ళెను. యాకోబు పారిపోయెనని మూడవ దినమున లాబానునకు తెలిసినప్పుడు, తన బంధువులందర్ని వెంటబెట్టుకొని గిలాదు కొండ మీద అతని కలిసికొనెను. లాబాను నీవు నీ తండ్రి ఇంట వాంఛ కలిగితే వెళ్ళుము కానీ, నా గృహ దేవతలను ఏల దొంగిలించితివని యాకోబుకి చెప్పి, అన్ని వస్తువులను, మనుష్యులను వెదకి నప్పుడు అవి దొరకక పోయెను. అప్పుడు యాకోబు కోపపడి "దేవుడు నాకు తోడై యుండని యెడల నీవు నిశ్చయముగా నన్ను వట్టి చేతులతోనే పంపివేసియుందువు అని లాబానుతో వాదించెను. అప్పుడు లాబాను ఈ కుమారులు, కుమార్తెలు, ఈ మంద నీకు కనబడుచున్న దంతయు నాది. వీరిని నేడు నేనేమి చేయగలను, కావున నేనును నీవును నిబంధన చేసికొందము రమ్ము, అది నీకును నాకును మధ్య సాక్షిగా ఉండునని ఉత్తరమిచ్చెను. యాకోబు ఒక రాయి తీసుకొని దానిని స్తంభముగా నిలిపి, ఇంకా రాళ్ళను కూర్చి కుప్ప వేసి ఈ కుప్ప నీకును నాకును మధ్య సాక్షిగా ఉండునని చెప్పి అక్కడ భోజనము చేసిరి. అంతట లాబాను నా కుమార్తెలను బాధపెట్టినను, నా కుమార్తెలను గాక యితర స్త్రీలను పెండ్లి చేసికొనినను, చూడుము మన యొద్ద ఎవరును లేరు గదా, నాకును నీకును దేవుడే సాక్షి అని చెప్పెను. మరియు లాబాను హాని చేయవలెనని ఈ కుప్పను, స్తంభమును దాటి నా యొద్దకు నీవును, నీ యొద్దకు నేనును రాకుండునట్లు ఈ కుప్ప, స్తంభమును సాక్షి. దేవుడు మన మధ్య న్యాయము తీర్చునని చెప్పెను. అప్పుడు యాకోబు తన తండ్రియైన ఇస్సాకు భయపడిన దేవుని తోడని ప్రమాణము చేసి, ఆ కొండ మీద బలి అర్పించి భోజనము చేయుటకు బంధువులను పిలువగా వారు భోజనము చేసి ఆ కొండ మీద ఆ రాత్రి వెళ్ళబుచ్చిరి.

గిద్యోను తన సేనలోని పిరికి వారు ఇంటికి పోవచ్చునని ఆజ్ఞ ఇయ్యగా అతని సైనికులు గిలాదు కొండ దగ్గర ఉన్నారు. ఈ ప్రాంతం సుగంధ ద్రవ్యములకును, మందు దినుసులకు ప్రసిద్ధమగుటచే వాటికి సంబంధించిన వ్యాపారములు అచ్చట జరిగెను. అట్టి వ్యాపారము మీద ఇష్మాయేలీయులు వెళ్ళుచుండగా యోసేపు అన్నలు యోసేపుని వారికి అమ్మిరి. యెఫ్తా, ఏలియా ప్రవక్తలు గిలాదు దేశస్థులు.




# బైబిల్ క్విజ్ -9

(పాత నిబంధనా గ్రంథంలో
11-15 పుస్తకములలో నుండి ఇవ్వబడినవి)

1. అంజూరపు పండ్ల ముద్ద కురుపు మీద వేసిన తరువాత స్వస్థత పొందిన రాజు ఎవరు?
2. ప్రవక్తల శిష్యులలో ఎంతమంది యొర్దానునది దగ్గర నిలిచిరి? రిఫరెన్సు?
3. ఎలీషా యొక్క తల యీ దినమున అతనిపైన నిలిచియున్న యెడల దేవుడు నాకు గొప్ప అపాయము కలుగజేయునుగాక అన్న రాజు ఎవరు?
4. ఆహాబు గృహ నిర్వాహకుడు ఎవరు?
5. నేను నీకు దేనినిచ్చుట నీకిష్టమో దాని నడుగుమని ఎవరు ఎవరితో అన్నారు? రిఫరెన్సు?
6. ఉప్పువేసి, నీటిని బాగుచేసిన ప్రవక్త ఎవరు? అతనిలోని ఆత్మ ఎన్ని పాళ్ళు?
7. రూపాయి ఒకటింటికి ఒక మానిక సన్నని పిండియు, రూపాయి ఒకటింటికి రెండు మానికల యవలును అమ్ముచున్నది ఎక్కడ?
8. కెరీతు వాగు దగ్గర నివాసము చేసిన వ్యక్తి ఎవరు?
9. నీవు నెమ్మది నొందిన వాడవై సమాధికి చేర్చబడుదువు అని యెహోవా నుండి వాక్కుని పొందిన యూదా రాజు ఎవరు?
10. ఉపవాసముండి ఎందు నిమిత్తము, ఏ నది దగ్గర దేవుని వేడుకొనవలెనని ప్రకటించారు?

ఈ ప్రశ్నలకి సరైన సమాధానములు మార్చి 31 తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మే పత్రికలో ప్రచురించబడతాయి.

పంపవలసిన చిరునామా:- **ఎడిటర్-స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 8 జవాబులు:**

1. సౌలు (1 సమూ 18:9)
2. రాహాబు (యెహో 2:1)
3. రూతు (రూతు 4:17)
4. దెలీలా, సమ్సోనుతో (న్యాయా 16:15)
5. అబ్షాలోము, ఇశ్రాయేలు ప్రజలతో
6. అబీగయీలు, దావీదుతో (1 సమూ 25:22)
7. యెహోషువ (యెహో 10:12)
8. ఇశ్రాయేలీయులు (రూతు 4:7)
9. యెఫ్తా కుమార్తె (న్యాయా 11:36)
10. 2 సమూ 22 అధ్యాయము (2సమూ 15:4)

**బైబిల్ క్విజ్ - 8 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

పాల్‌రాజ్, సౌజన్య, విజయకుమారి, సాల్మన్‌రాజు, జార్జిముల్లర్, వసంతరాణి, పద్మాకర్, మేరీ సాల్మన్

# ఎపఫ్రా మినిస్ట్రీస్

## 2010 ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు

| నెల | తేది | వారం | సమయం (ఉదయం) | స్థలం (మందిరం) |
|---|---|---|---|---|
| జనవరి | 26 | మంగళ | 9.00 | భాగ్యలత |
| ఫిబ్రవరి | 7 | ఆది | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |
| మార్చి | 16 | మంగళ | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |
| ఏప్రియల్ | 2 | శుక్ర | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |
| మే | 1 | శని | 9.00 | భాగ్యలత |
| జూన్ | 6 | ఆది | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |
| జూలై | 4 | ఆది | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |
| ఆగస్టు | 15 | ఆది | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |
| సెప్టెంబర్ | 11 | శని | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |
| అక్టోబర్ | 2 | శని | 9.00 | భాగ్యలత |
| నవంబర్ | 5 | శుక్ర | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |
| డిశంబర్ | 5 | ఆది | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |

**యౌవనస్థుల కూడికలు:-**
ప్రతి నెల 2వ బుధవారం - చింతల్
ప్రతి నెల 3వ బుధవారం - భాగ్యలత
రాత్రి గం. 7.00 లకు

**స్త్రీల కూడికలు:-**
ప్రతి నెల 1వ బుధవారం - భాగ్యలత
ప్రతి నెల 2వ బుధవారం - అనాజ్‌పూర్
ప్రతి నెల 3వ బుధవారం - చింతల్
రాత్రి గం. 7.00 లకు

**సేవకుల కూడిక:-** ప్రతి నెల 4వ బుధవారం - భాగ్యలత నందు రాత్రి గం. 7.00 లకు.

**"భయపడకుము నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచు నీ కుడి చేతిని పట్టుకొనుచున్నాను"**

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మార్చి - ఏప్రియల్

భాగ్యలత : పుష్పలత, రాజేశ్వరి, పద్మ, తిమోతి, మోజెస్, దీపిక, తేజ (మిర్యాలగూడ), పీటర్, ఏలియా, సలోమియ, రూతు, సుజాత, గీత, రాహుల్, హెప్సిబా, యోజస్వి, అభినయశ్రీ, సురేష్, కళ, నాగేష్, ప్రియాంక, పద్మ, కృపారావు, జిన్నిబాబు, ఎలీషాబాబి, కె.ఎల్.నరసింహరావు, జయ, అభిషేక్, నోహ, విమలాప్రసాద్, శేషగిరిరావు, రాజేష్, ఆషా, పర్ణిక, గ్రీష్మ, మధురిమ, జీవన్, కెజియా, నోయాగ్రేస్, శ్రీకాంత్‌రవి, పద్మాకర్, శ్రీవిద్య

చింతల్ : రాజేష్, స్నేహ, శ్రీకాంత్, జయానంద్, బాలరాజు, విజయ్, రాణి, శాంతిప్రియ, రాధామణి, సూర్యదీపిక,శిరీష, సురేంద్ర, హేమకుమారి, జీవన్ కుమార్, విజయ, దేవిడ్, సుధాకర్, మైఖేల్, అనంతరావు, రాజామన్నార్, మోహన్.

అనాజ్‌పూర్ : ప్రభుదాస్, మరియమ్మ, కరీమున్, ఆనందరావు, ధనలక్ష్మి, శ్రావణి, రమేష్‌బాబు, పీటర్, దేవిడ్, పాల్‌రాజ్, స్వాతి, ఆరాధన, రూతు, కృపావరం, జాస్మిన్.

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/-లు, సంవత్సర చందా రూ. 50/-లు, జీవితకాల చందా రూ. 1000/-లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

**మీ ప్రార్థనావసరతలు:**

____________________

____________________

____________________

____________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# చంద్రలీల

చంద్రలీల నేపాల్ దేశములో ఒక సంపన్న బ్రాహ్మణ కుటుంబములో జన్మించారు. ఆమె తండ్రి ఆస్థాన పురోహితుడు. బాల్య దినములలోనే వివాహము జరిగింది కానీ దురదృష్టవశాత్తు భర్తని కోల్పోయింది.ఆమె తలవెంట్రుకలు కత్తిరించి, తెల్లచీర కట్టి శపితమైన స్త్రీగా హీనపరిచేవారు కనుక చంద్రలీల తన జీవితములో ప్రేమ, ఆదరణల కొరకు వెదుకుచు ఆత్మశాంతి సాధనకై అనేక పుణ్యక్షేత్రములు దర్శిస్తూ, అనేక దేవుళ్లను పూజించుచుండెను.

పాపపరిహారార్థం వ్యయ ప్రయాసలకు లోనై పుణ్యం దొరుకుతుందన్న భ్రమతో సకల శ్రమలు సహిస్తూ, భారతదేశమంతా పర్యటించింది. గంగానదిలో మునిగిన వెంటనే పాపాలన్నీ పరిహరించబడతాయని, పేదలకు అన్నదానం చేయుట వలన ఆత్మశాంతి దొరుకుతుందని భావించి, ఇవన్నీ చేసిననూ ఆమె ఆశ నిరాశ అయినది. కొన్ని వందల మైళ్ళ పాదయాత్ర చేసి, ధనధాన్యాలను ధర్మం చేయుచూ, గోదానములు చేసిననూ, మనస్సుకు నెమ్మది కలుగలేదు. సుఖాసక్తి జీవితమునకు స్వస్తి చెప్పి, శరీరమును శ్రమల పాలు చేసుకుంటేనే గాని ఆత్మశాంతి లభించదని చెప్పినప్పుడు కాషాయ వస్త్రములను ధరించిననూ శాంతి లభించలేదు.

ఎటూ తోచని స్థితిలో ఉండగా ఒకరోజు ఇద్దరు మిషనరీలు ఆమెకు యేసుక్రీస్తు సకల మానవుల పాపముల కొరకు సిలువలో మరణించాడని, ఆయన రక్తము ద్వారా పాపక్షమాపణ ఉచితముగా దొరుకునని చెప్పినప్పుడు గ్రహించి, నమ్మి, వారి దగ్గర బైబిలు గ్రంధమును కొని శ్రద్ధగా చదవనారంభించింది. బైబిల్ చదువుచుండగా యేసుక్రీస్తే పాపుల రక్షకుడని పాపములను ఒప్పుకొని ఆయనకు తన హృదయమును సమర్పించుకొనెను. ఆమె ఇంటివారు, స్నేహితులు, శిష్యులు అంటరాని వారితో కలిసిపోయి, మన బ్రాహ్మణ గౌరవమును మంట గలిపావు అని ఆమెను హేళన చేసి వెలివేశారు. “నా పాత బ్రతుకునకు, పాత జీవితమునకు నేను చచ్చిపోయాను, నేను క్రీస్తునందు తిరిగి జన్మించాను, నేనిప్పుడు నూతన జీవితము జీవిస్తున్నాను” అని సాక్ష్యమిచ్చుచూ యేసుప్రభువు కొరకు తన శేష జీవితం జీవించి, తన వలె విధవరాండ్రుగా ఆదరణ లేక యున్న అనేక ఆత్మలను ప్రభువు యొద్దకు నడిపించెను.

జనవరి 26, 2010 బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉపవాస ప్రార్థనలో పాల్గొన్న సహోదర, సహోదరీలు.





# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com